సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 9 । జూలై । 2023

మహానేతా మనసాస్మరామి



పార్వతీపురంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- పండగలా మహానేత వైఎస్సార్ జయంతి
- పార్వతీపురంలో పది అడుగుల వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ
- వైఎస్సార్ మార్గ్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

పార్వతీపురంటౌన్: అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలుగుప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మహానేత జయంతి సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పది అడుగుల వైఎస్సార్ విగ్రహాన్ని డిప్యూటీ సీఎం రాజన్నదొర, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజుతో కలిసి శనివారం ఆవిష్కరించారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినదించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, మేళతాళాలతో పండగలా నిర్వహించిన జయంతి వేడుకల్లో వేలాదిమంది అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. వైఎస్సార్ మార్గ్‌ను ప్రారంభించిన అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వైఎస్సార్ స్ఫూర్తితో జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. తోటపల్లి, పెద్దగెడ్డ, వెంగళరాయసాగర్, జంఝావతి ప్రాజెక్టులను అభివృద్ధి చేసి లక్షలాది ఎకరాలకు నీరందించిన అపర భగీరథుడిగా వైఎస్సార్ పేరుగాంచారన్నారు.

★ డిప్యూటీ సీఎం రాజన్నదొర మాట్లాడుతూ విద్య, వైద్యం, రైతన్నలకు మేలుచేసే పథకాలను ప్రవేశపెట్టి పేదల ఆరాధ్యదైవంగా వైఎస్సార్ పేరుపొందారన్నారు. ఆయన అడుగుజాడల్లో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారన్నారు.

★ శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ ఉచిత విద్యుత్ పథకంపై తొలిసంతకం చేసి సాగును పండగగా మార్చిన మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. విద్యా, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు.

★ పెద్దాన పేరు వినగానే అందరికీ గుర్తుకు వచ్చేది స్వచ్ఛమైన చిరునవ్వు, నమస్తే అక్కా.. నమస్తే చెల్లి.. నమస్తే తమ్ముడు అంటూ అందరినీ ఆప్యాయంగా పిలిచే పిలుపు ప్రతిధ్వనిస్తుందన్నారు. రూ.వందలకోట్ల రుణాలు మాఫీ చేసి రైతుల పాలిట దైవంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, పార్వతీపురం నియోజకవర్గ పరిశీలకులు శోభా హైమావతి, మూడు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఆరికతోట గ్రామానికి చెందిన గ్రీన్ అంబాసిడర్ మామిడి గౌరి(55) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి గ్రామంలో శనివారం విజిలెన్స్ అధికారులు 500 కేజీల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. సీఎస్‌డీటీ సాయికృష్ణ తెలిపిన వివరాలు... కొట్టక్కి గ్రామంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేస్తున్నారన్న సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ బి.సింహాచలంతో పాటు సీఎస్‌డీటీ, విజిలెన్స్ సిబ్బంది కలిసి తనిఖీలు చేశారు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న పృథ్వీరాజ్

పార్వతీపురం: కడుపు నొప్పి తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. పార్వతీపురం మండలం టొంకి గ్రామానికి చెందిన ఎం.పృథ్వీరాజ్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉదయం కడుపునొప్పి రావడంతో భరించలేక ఇంటిలో మిగిలి వున్న పురుగుల మందును తాగి ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం డోకిశీల పీహెచ్‌సీకి తరలించి చికిత్సను అందించారు. మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వాహనం ఢీకొని జింక మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జింక

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్‌ఐ కృష్ణమూర్తి సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన జింకను పరిశీలించారు. అనంతరం మృతి చెందిన జింకను ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. ప్రమాదంలో చనిపోయిన జింక వయసు సుమారు మూడు సంవత్సరాలు ఉంటుందని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్

- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- దివంగత నేత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు
- కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఎమ్మెల్సీలు, నగర మేయర్‌లు



దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

విజయనగరం: పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గం ఆధ్వర్యంలో నగరంలోని వెంకటలక్ష్మి కూడలి వద్ద శనివారం నిర్వహించిన దివంగత నేత జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, ఇతర నేతలతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాల గురించి మంత్రి బొత్స సత్యనారాయణ వివరించారు. మహానేత వైఎస్సార్ పాలన మాదిరిగానే పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోని ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. రాజశేఖరరెడ్డిది మాట తప్పని.. మడం తిప్పని నైజం అని కితాబిచ్చారు. ఆయన పాలన భావితరాల వారికి ఆదర్శం అని పేర్కొన్నారు. ఎప్పటికీ మరువ లేని.. మరెవ్వరు చేయలేని మంచి ప్రజలకు చేశారని గుర్తు చేశారు. తండ్రికి తగ్గ తనయుడిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారని కితాబిచ్చారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. దివంగత వైఎస్సార్ జయంతి రోజున ఇటు నగరంలో.. అటు రాష్ట్రంలో మంచి పనులు చేపట్టామని రైతు దినోత్సవాన్ని.. నగరంలో చేపట్టిన శంకుస్థాపన మహోత్సవాలను ఉద్దేశించి మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయ యాదవ్, నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాబు మాటలు నమ్మొద్దు



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- ప్రతిపక్షాలపై ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర విమర్శలు

సాలూరు:

ఎన్నికల వేళ చంద్రబాబు, ఆయన ముఠా సభ్యులు మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసేందుకు బస్సు యాత్ర పేరుతో మరోసారి వస్తున్నారని వారిని నమ్మొద్దని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. వారి మోసపూరిత మాటలు, హామీలు నమ్మి మోసపోవద్దని కోరారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల వేళ బస్సు యాత్ర పేరుతో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి టీడీపీ నాయకులు మళ్లీ ప్రజల చెవిలో పూలు పెట్టడానికి వస్తున్నారని మండిపడ్డారు. పచ్చ మీడియా, పచ్చ నేతలు పచ్చి అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్నారని, ప్రజలు వారిని పట్టించుకోరన్నారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఇంటింటికి తాగునీరు ఇస్తానని చెప్పడానికి చంద్రబాబుకు సిగ్గుందా? అని ప్రశ్నించారు. బాబు వస్తే జాబు వస్తుందని గతంలో మోసం చేసిన చంద్రబాబు మళ్లీ ఏ ముఖం పెట్టుకొని జనం మధ్యకు వస్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు బస్సు యాత్ర పేరుతో పట్టణంలో నిర్మితమవుతున్న వంద పడకల ఆస్పత్రి చూసేందుకు రావడానికి సిగ్గుందా? అని నిలదీశారు. చంద్రబాబు హయాంలో ఏ రోజైనా సంక్షేమ ఫలాలు అర్హులకు అందాయా.. అని నిలదీశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ప్రజామోదం పొందాయన్నారు. దేశంలోనే ఆదర్శవంతమైన సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్నాయని చెప్పారు. చంద్రబాబు, ఆయన దొంగల ముఠా చేపట్టే బస్సు యాత్రను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలన్నారు. ఆయన వెంట పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

వ్యవసాయాన్ని పండగగా మార్చిన జగనన్న



వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: దేశానికి రైతే రాజని భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో రైతు సంక్షేమ పాలన అందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ఏర్పాటు చేసిన రైతు దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుమారు రూ.1.05కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన బీమా పరిహారం బాధిత రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తరువాత ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి కట్టుబడ్డారన్నారు. వ్యవసాయ ఉత్పాదకాల నాణ్యత నిర్ధారణ కోసం రాష్ట్రంలో రూ.63.96 కోట్లతో నిర్మించిన 52 డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 213.27 కోట్ల వ్యయంతో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో 147, జిల్లా స్థాయిలో 10 అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు, నాలుగు రీజనల్ కోడింగ్ సెంటర్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతు సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి రైతు బాంధవుడిగా పేరొందారని కొనియాడారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోవిందరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్, ఏడీఏ మధుసూదనరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు డా.డీవీజీ శంకరరావు, పువ్వల ఈశ్వరమ్మ, జర్జాపు దీప్తి,, వంగపండు అప్పలనాయుడు, రెడ్డి సురేష్, దండి శ్రీనివాసరావు, డోల బాబ్జి, సలాది అప్పలనాయుడు, గిరి రఘు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



సింహచలంనాయుడు మృతదేహం

పార్వతీపురం/జియ్యమ్మవలస: ఆరోగ్య సమస్యలు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జియ్యమ్మవలస మండలం తురకనాయుడువలస గ్రామానికి చెందిన దాసరి సింహాచలంనాయుడు(73) తీవ్ర అనారోగ్యంతో కొన్నాళ్లుగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బాత్‌రూం క్లినింగ్‌కు వాడే లిక్విడ్‌ను తాగాడు. దీన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సింహాచలంనాయుడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీవీజీని సన్మానించిన పీడిక

సాలూరు:

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ డీవీజీ శంకరరావును ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర సన్మానించారు. చైర్మన్‌గా నియమితులైన నేపథ్యంలో డీవీజీ ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా శనివారం సాలూరులో కలిశారు. ఈ సందర్భంగా శంకరరావును ఉప ముఖ్యమంత్రి అభినందించారు. తనపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని డీవీజీ చెప్పారు. తనకు ఇంతటి పదవి బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. ఇందుకు కృషి చేసిన విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన డీవీజీ శంకరరావును అభినందిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో గాయాల పాలైన చిన్నారి లాస్య

శృంగవరపుకోట: పట్టణంలో విశాఖ - అరుకు రోడ్డులో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయాల పాలయ్యారు. ఉదయం 6.30 గంటల సమయంలో వేపాడ మండలం బొద్దాం గ్రామానికి చెందిన జేసీబీ ఆపరేటర్ తూర్పాటి సతీష్ తన భార్య శాంతి, కుమార్తె లాస్య, కుమారుడు తనుష్‌లతో కలిసి గుడికి వెళ్లేందుకు బైక్‌పై ఎస్.కోట బయల్దేరారు. ఎస్.కోట పట్టణంలోకి ప్రవేశిస్తున్న సమయంలో స్థానిక ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో బైక్‌కి పెట్రోల్ పోయించుకుని ప్రధాన రహదారిపైకి వస్తున్న అల్లు జగదీష్‌ను బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సతీష్ కుటుంబ సభ్యులతో పాటూ జగదీష్‌కు గాయాలయ్యాయి. రెండు బైక్‌లు బాగా దెబ్బతిన్నాయి. కాగా ప్రమాదంలో చిన్నారి లాస్య తీవ్ర గాయాల పాలైంది. ఆమెను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసినప్పటికీ చెవులు, ముక్కు నుంచి రక్తస్రావం కావటంతో విశాఖకు తరలించారు. తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్.కోట పోలీసులు చెప్పారు.

భారీ వాహనం తరలి రాగా...



ఏజీ రోడ్డుపై 96 టైర్లు వాహనంపై యంత్ర పరికరం

భామిని: మండలంలోని ఏబీ రోడ్డులో శనివారం ప్రయాణించిన అతి భారీ వాహనం చూపరులను అలరించింది. అతి పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ లాంటి యంత్ర పరికరాన్ని తరలిస్తున్న అతి భారీ వాహనం ఆకట్టుకొంది. ట్రాన్స్‌ఫార్మర్ లాంటి యంత్ర పరికరాన్ని 96 టైర్లు గల తారాస్‌పై బిగించారు. వరుసకు 8 టైర్లు చొప్పున్న 12 వరుసలు గల ట్రాలీపై అమర్చారు. మరో 18 టైర్లు గల ఇంజిన్‌తో లాగిస్తుండడం విశేషం. ప్రస్తుతం భామిని మండలం బిల్లుమడ - సింగిడి గ్రామాల మధ్య రోడ్డుపై నిలిపివేశారు. రోడ్డుపై ప్రయాణానికి క్లియరెన్స్ లేక నిలిపివేయడంతో ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. విశాఖ షిప్‌యార్డ్ నుండి చత్తీస్‌గఢ్‌కు ఈ భారీ వాహనం వెళ్తుంది.

సాగునీటి కాలువలు దెబ్బతినకుండా చర్యలు

- ఆర్‌డీవో సూర్యకళ

గంట్యాడ: జాతీయ రహదారి (హైవే) నిర్మాణంలో భాగంగా సాగు నీటి కాలువలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని హైవే అధికారులకు ఆర్‌డీవో సూర్యకళ ఆదేశించారు. ఈ నెల 6వ తేదీన తాటిపూడి వద్ద జరిగిన సమావేశంలో రైతులు సాగునీటి కాలువులను మూసి వేసి హైవే అధికారులు రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన వెంటనే జాయింట్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శుక్రవారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలోను ఇదే విషయాన్ని ఎమ్మెల్యే మంత్రి బొత్స దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం రెవెన్యూ ఇరిగేషన్, హైవే అధికారులు సంయుక్తంగా పర్యవేక్షణ చేశారు. రహదారికి సంబంధించిన మ్యాప్‌లు, సాగునీటి కాలువలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆర్‌డీవో తెలిపారు. తహసీల్దార్ స్వర్ణకుమార్, ఇరిగేషన్ ఏఈ తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,510-00
బంగారం(22సి. 10గ్రా.)	54,550-00
వెండి (కిలో)	76,700-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

పెద్దగెడ్డ నీరు విడుదల రేపు

సాలూరు: పాచిపెంట మండల కేంద్రంలో గల పెద్దగెడ్డ రిజర్వాయర్ నీటిని సోమవారం విడుదల చేయనున్నట్టు పెద్దగెడ్డ డీఈ కనకారావు శనివారం తెలిపారు. నీటి విడుదలకు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను ఈ మేరకు ఆహ్వానించారు. శనివారం ఆయన గృహంలో కలిసి నీటి విడుదలకు రావాలని డీఈ కోరారు. ఈ సందర్భంగా నీటి విడుదలపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ రిజర్వాయర్ ద్వారా పాచిపెంట, సాలూరు, రామభద్రపురం తదితర మండలాల్లో సుమారు 12 వేల ఎకరాలకు సాగునీరు అందనుందని అధికారులు తెలిపారు. జేఈ రవికుమార్, వెంకట్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

విజయనగరం రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు సూచించారు. విజయనగరం మండలంలోని దుప్పాడ గ్రామాన్ని శనివారం ఉదయం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.జగదీష్, వైద్య సిబ్బందితో కలసి గ్రామంలో పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. రాకోడు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ మాణిక్యం, ఎంపీహెచ్‌ఈఓ సన్యాసిరావు, హెచ్‌వీ జయ, సిబ్బంది శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.